సాక్షి
మెదక్
శనివారం । 16 । ఆగస్టు । 2025

సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా బతుకమ్మనెత్తి నృత్యం చేస్తున్న విద్యార్థినులు





భరతమాత వేషధారణలో విద్యార్థిని

న్యూస్‌రీల్

సాహసానికి పురస్కారం

సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్న కానిస్టేబుల్ వంశీ



అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ వంశీ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ వంశీ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్రే హౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో అత్యుత్తమ కర్తవ్య నిర్వహణ, అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించినందుకు గాను ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ గ్యాలెంట్రీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వంశీని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అభినందించారు.

అంగడి ఆగమాగం

వర్షంతో కొట్టుకుపోయిన కూరగాయలు



నీటిలో కొట్టుకుపోతున్న కూరగాయలు

నర్సాపూర్: పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో అంగడి ఆగమాగమైంది. ప్రతి శుక్రవారం నర్సాపూర్‌లో అంగడి నిర్వహిస్తారు. కూరగాయలు, బట్టలు, ఇతర నిత్యావసర సరుకులు, పండ్లు, ఇండ్లలో వినియోగించే పనిముట్లు అమ్మే వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తారు. సాయంత్రం కురిసిన కుండపోతకు కొనుగోళ్లు జరగలేదు. పైగా వర్షం నీటిలో కూరగాయలు కొట్టుకుపోయాయి. వర్షంతో తమకు చాలా నష్టం వచ్చిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా భారీ వర్షంతో రోడ్లపై నుంచి వర్షం నీరు ఎక్కువగా పారడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలే: దేవ్ కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): యూరియాను కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెడితే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్ హెచ్చరించారు. మాసాయిపేట మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం ఆగ్రోస్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్, ఏఈఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో 14.6సెం.మీ వర్షం



చండూర్‌లో నీట మునిగిన పత్తి పంట

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు 14.6 సెం.మీ వర్షం కురిసింది. జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదైనట్లు మండల గణాంకాధికారి దివ్యభారతి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, కురుస్తున్న భారీ వర్షాలకు చిలప్‌చెడ్ మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. చిలప్‌చెడ్‌లో కురిసిన వర్షానికి పాక్షికంగా కూలిన ఇళ్లు తహశీల్దార్ సహదేవ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సునీల్‌సింగ్ ఉన్నారు.

చినుకుపడితే కరెంట్ కట్

సరఫరాలో తీవ్ర అంతరాయం

నర్సాపూర్: నర్సాపూర్‌లో కరెంటు సరఫరాలో అంతరాయం సాధారణమైందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రతి రోజు కరెంట్ కోతలు ఉంటున్నాయని, చినుకు పడితే కరెంటు పోతుందని, మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. రెండు రోజులుగా కరెంట్ సరఫరాలో అంతరాయం మరింత ఎక్కువైందని స్థానికులు తెలిపారు. శుక్రవారం సైతం కరెంటు చాలా సార్లు పోయిందని అన్నారు. కరెంట్ ఎక్కువ సార్లు పోవడంతో విద్యుత్తు పరికరాలు పాడుతున్నాయని అన్నారు. పట్టణంలో కరెంటు సరఫరాను మెరుగు పర్చాలని వినియోగదారులు కోరుతున్నారు.

అభివృద్ధిలో పరుగులు

● మెదక్ జిల్లాలో వేలాది కోట్లతో అభివృద్ధి పనులు ● స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వివేక్



మంత్రి, కలెక్టర్‌తో సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులు



మాట్లాడుతున్న మంత్రి వివేక్

మెదక్‌జోన్: అభివృద్ధిలో జిల్లా పరుగులు పెడుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెదక్ జిల్లాను రూ.వేలాది కోట్లకు పైగా ఖర్చుచేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఆయన పోలీస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 87,491 మంది రైతులకు గానూ రూ.645.41 కోట్లను రుణమాఫీ చేసిందన్నారు. 2024–2025 సీజన్‌కు సంబంధించి 3,19,144 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని 80,873 మంది రైతుల నుంచి సేకరించి వారికి రూ.740.42 కోట్లను చెల్లించామని వివరించారు. అలాగే 15 వేల మంది రైతుల నుంచి 62,747 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం సేకరించామని, వీరికి బోనస్ కింద క్వింటాల్‌కు రూ.500 చొప్పున రూ.31.37కోట్లను త్వరలోనే రైతుల ఖాతాలో వేస్తామని చెప్పారు. రైతు భరోసా కింద వానాకాలం సీజన్‌లో 2,62,043 మంది రైతుల ఖాతాల్లో రూ.220.84 కోట్లను జమచేసినట్లు తెలిపారు.

మెడికల్ కాలేజీ భవనానికి రూ.180 కోట్లు

జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి భవన నిర్మాణం కోసం రూ.180 కోట్లు, అలాగే నర్సింగ్ కాలేజీ భవనం కోసం మరో రూ.26 కోట్లను మంజూరు అయినట్లు మంత్రి వివేక్ తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వివరించారు. ఈ పథకం ద్వార జిల్లాలో ఇప్పటివరకు 18,626 మంది రోగులకు శస్త్ర చికిత్సలు చేయగా...ఇందుకోసం రూ. 49.71 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల కాంప్లెక్స్‌ను రామాయంపేటకు మంజూరైందని వెల్లడించారు. అదేవిధంగా జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల మరమ్మతుల కోసం రూ.3.26 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

పేదలకు అండగా...

జిల్లాలో 2,16,716 కుటుంబాలకు మూడు నెలలకు సరిపడే రేషన్ 13,923 మెట్రిక్ టన్నుల బియ్యం అందించినట్లు మంత్రి తెలిపారు. అలాగే జిల్లాలో 9,964 కొత్త రేషన్‌కార్డులను ఇచ్చామన్నారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా జిల్లాకు మొదటి విడతలో 9,125 ఇళ్లు మంజూరు కాగా, అందుకు రూ.456.25 కోట్లు మంజూరయ్యాయని, వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 1,302 మంది లబ్ధిదారులకు రూ.13.42 కోట్లను వారి ఖాతాల్లో జమచేశాం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

3.2కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు

మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 3.2 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేయగా అందుకు రూ.83.50 కోట్ల లబ్ధిని మహిళలు పొందారని మంత్రి వివేక్ చెప్పారు. అలాగే గృహజ్యోతి పథకంలో భాగంగా 1,27,393 మంది విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్లలోపు జీరో బిల్లు జారీ కాగా ఇందుకోసం రూ.65.3 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు.

అవార్డులు మరింత బాధ్యతలు పెంచుతాయి

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: అవార్డులు, రివార్డులు మరింత బాధ్యతలను పెంచుతాయని ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. జిల్లాలో ఉత్తమ సేవ ప్రశంసా పత్రాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. అనంతరం వారిని అభినందించారు.

మహనీయుల త్యాగాలను మరవొద్దు

మనదేశానికి స్వాతంత్ర్యం సాధించిన పెట్టిన మహనీయుల త్యాగాలను మరువొద్దని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌరవ వందనాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహనీయుల ప్రాణత్యాగాల ఫలితమే ఈ స్వాతంత్ర్యమని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు సిబ్బంది దేశానికే గర్వకారణంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం తెచ్చిన ఆనందం

ఒకే వేదికపై తండ్రీకొడుకులకు పురస్కారం



పురస్కారం పొందిన అనంతరం తండ్రీకొడుకులు నరేందర్‌రెడ్డి, అర్జున్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): తన కొడుకు ప్రయోజకుడు కావాలని.. తన కళ్ల ముందే ప్రశంసలు పొందాలని ఏ తండ్రైనా కలలు గంటాడు. తన తండ్రి సమాజంలో ఉన్నతుడిగా నిలవాలని ప్రతి కొడుకు ఆశిస్తాడు. మెదక్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ పురస్కారాల వేడుక వారిద్దరి ఆశలను సఫలం చేసింది. పాపన్నపేటకు చెందిన కుకునూరి నరేందర్‌రెడ్డి మెదక్‌లో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. మరో పది నెలల్లో పదవీ విరమణ చేయబోతున్నారు. ఆయన కొడుకు అర్జున్‌రెడ్డి మెదక్ కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన గ్రూప్ 3 పరీక్షల్లో స్టేట్‌టాపర్‌గా నిలిచారు. వారు వృత్తిపరంగా చేస్తున్న సేవలను గుర్తించిన జిల్లా అధికారులు ఆ తండ్రీకొడుకులకు ఉత్తమ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఒకే వేదికపై తండ్రీతనయులు సత్కారం పొందిన తీరు అందరినీ ఆనంద పరిచింది.

తండాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

రామాయంపేట(మెదక్): గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హామీ ఇచ్చారు. మండలంలోని జెమ్లా తండాలో సేవాలాల్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానన్నారు. నియోజకవర్గం పరిధిలో దాదాపు గిరిజన తండాలకు తారు రోడ్డు సదుపాయం కల్పించామని మిగిలిన తండాలకు సైతం త్వరలోనే రోడ్డు సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిధులతోపాటు తన సొంత నిధులతో కూడా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, పార్టీ నాయకులు బండారి మహేందర్‌రెడ్డి, పాండు నాయక్, బన్సీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజీనామా

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని మనస్తాపం చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అవుసుల భవాని శుక్రవారం తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి గెలుపుకోసం ఎంతగానో కృషి చేశానని, పార్టీ నిర్వహించే కార్యక్రమంలో తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామా పత్రాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతకు ఫ్యాక్స్ ద్వారా పంపించారు.



రాజీనామా పత్రాన్ని చూపుతున్న భవాని

తిరంగా.. మురవంగా

కలెక్టరేట్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



కలెక్టరేట్‌లో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మెదక్ కలెక్టరేట్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావులతో కలిసి మహనీయుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. అలాగే స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలు, జానపద, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలపై విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. విద్యార్థులకు మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావులు అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్ఓ భుజంగరావు, ఏఓ యూనస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా మంజీరా

- సింగూరు నుంచి 20వేల క్యూసెక్కుల నీరు విడుదల
- పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మంజీర వరదల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. సింగూరు నుంచి 20,265 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో మంజీర ఉరకలెత్తి ప్రవహిస్తోంది. దీంతో ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లుతోంది. శుక్రవారం ఏడుపాయల్లో పరిస్థితిని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇరిగేషన్, పోలీసు, ఆలయ అధికారులతో సమీక్షించారు. మంజీర వరద ఉధృతిని ఎప్పటి కప్పుడు అంచనా వేస్తుండాలని అధికారులకు సూచించారు. భక్తులెవరూ మంజీర నది వైపు వెళ్లకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాపర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండాలన్నారు. పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, పోలీసులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.



మంజీర వరదల నేపథ్యంలో అధికారులకు సూచన ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

దుర్గమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి

జిల్లా న్యాయమూర్తి నీలిమ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి దుర్గమ్మ ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. రాజగోపురంలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహానికి ఆమె పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు.

అమర జవాన్ స్తూపం ఆవిష్కరణ

పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ సైనికులు



అమర జవాన్ జ్యోతి స్మారక స్తూపం వద్ద మాజీ సైనికులు

జహీరాబాద్ టౌన్: దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవానుల జ్ఞాపకార్థం ధనసిరి గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ స్మారక స్తూపాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాజీ సైనికులు ప్రారంభించారు. మొగుడంపల్లి మండలం రాష్ట్ర సరిహద్దులో గల ధనసిరి గ్రామంలో దేశ రక్షణ కోసం ఎందరో సైన్యంలో చేరి సేవలందించారు. ఆర్మీలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన వారు గ్రామంలో వీర అమర్ జవాన్ జ్యోతి స్మారక స్తూపం నిర్మాణానికి శ్రీకారం చుట్టి గ్రామస్తుల సహకారంతో పూర్తి చేశారు. 15 చదరపు అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పు ఎత్తులో గ్రానైట్ రాయితో ఇండియా గేట్ వద్ద మాదిరిగా నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాజీ సైనికులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, మాజీ ఎంపీ.బీబీపాటిల్ హాజరై స్మారక స్తూపానికి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ధనసిరి గ్రామస్తులు సైన్యంలో చేరి దేశసేవ చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు బీదర్ జిల్లా నుంచి, మాజీ సైనికులు హబ్సి దేవరాజ్, కాశీనాథ్, అశోక్ ,గణపతి, సంజీవ్‌రెడ్డి, విశ్వనాథ్, చంద్రశెట్టి, బస్వరాజ్, మల్లికార్జున్, సురేశ్ యాదవ్, బక్కారెడ్డి, యూనూస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ దొంగ అరెస్టు



బైక్, నిందితుడిని చూపుతున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): బైక్‌ను దొంగిలించిన వ్యక్తిని హద్నూర్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... మండల పరిధిలోని గంగ్వార్ గ్రామానికి చెందిన నడిమిదొడ్డి అశోక్ నెల రోజుల క్రితం పొలానికి వెళ్లాడు. అక్కడ బైక్‌ను నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం గంగ్వార్ చౌరస్తా వద్ద ఎస్ఐ సుజిత్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలో భాగంగా బీహార్‌కు చెందిన లక్ష్మణ్ టీఎస్15 ఎఫ్ 8026 బైక్‌పై వెళ్తున్నాడు. పోలీసులు బైక్‌ను ఆపి వాహన పత్రాలు అడగగా గంగ్వార్‌లో బైక్‌ను దొంగిలించినట్లు నిందితుడు తెలిపాడు. బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేశారు.

జాతీయ జెండాకు అవమానం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా పాఠశాలలో హెచ్ఎం జెండాను ఆవిష్కరించే క్రమంలో పైకి వెళ్లాక ముడి రాలేదు. దీంతో తాడును హెచ్ఎం బలంగా లాగడంతో జెండా తాడు నుంచి తెగిపోయి నేలమీద పడింది. వెంటనే సిబ్బంది జెండా పైపును కిందకు తీసి తిరిగి జెండాను ముడి వేసి ఆవిష్కరించారు. బాధ్యత గల ప్రాధానోపాధ్యాయుడు జెండాను ఆవిష్కరించే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు మండిపడ్డారు.

కోమటి చెరువులో మృతదేహం

సిద్దిపేటకమాన్: చెరువులో కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం... పట్టణంలోని కోమటి చెరువులో శుక్రవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీయగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. గుర్తు పట్టడానికి వీలులేకుండా కుళ్లిన స్థితిలో ఉంది. మృతుడి వయస్సు సుమారు 35నుంచి 40ఏళ్లు ఉంటుందని సీఐ తెలిపారు. మృతుడి కుడి చేతికి మూడు వరుసల జపమాల, రాఖీ కట్టి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేశారు.

వ్యవసాయంపై అవగాహన



మ్యాప్ వేసి అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: మండలంలోని అవంచ గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ భార్గవి, రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి సంధించిన మ్యాప్ వేసి పంట సాగు భూములు, జనాభా, వర్ష పాతం, సీజనల్ క్యాలెండర్ వేశారు. అనంతరం గ్రామస్తులతో వ్యవసాయ పరిస్థితులు, వనరులు, సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అక్షిత, అక్షయ, ఆదిరా, కీర్తన, కీర్తిప్రియ పాల్గొన్నారు.

పాఠశాలకు సహాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జెడ్పీ పాఠశాలకు సాతంత్య్ర వేడుకల సందర్భంగా మాజీ సర్పంచ్ శంకరప్ప మనవడు ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ పాఠశాల అవరణలో స్టేజీ నిర్మాణం కోసం ముందుకొచ్చాడు. అలాగే మాజీ సర్పంచ్ స్వతంత్ర కుమార్‌గౌడ్ ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ. లక్ష హెచ్ఎం దీప్లారాథోడ్‌కు అందించారు. మిర్జాపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యావలంటీర్‌కు ప్రతి నెల రూ.5 వేలు ఇచ్చేందుకు మాజీ ఉప సర్పంచ్ మనోజ్ ముందుకొచ్చారు. రుద్రారం ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.15 వేల సౌండ్ సిస్టంను అందజేశారు.



అలుగు పారుతున్న జగిర్యాల చెరువు

రేగోడ్(మెదక్): మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. రాత్రి ఏకధాటిగా వర్షం పడటంతో పలు గ్రామాల్లో పురాతన ఇండ్లు కూలిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అవగా.. జగిర్యాల చెరువు అలుగు పారుతోంది. చెరువును చూసేందుకు పర్యావరణ ప్రేమికులు తరలి వస్తున్నారు. స్థానిక తహసీల్దార్ దత్తారెడ్డి, ఆర్ఐలు ఫెరోజ్, విజయలక్ష్మి చెరువును సందర్శించారు. చెరువు అలుగు పారుతుండటం వల్ల వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని తహసీల్దార్ సూచించారు.



వర్షాలు లేక ముందు.. బీటలు బారిన వరి మడి



ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చబడిన మడి

మొన్న బీటలు.. నేడు పచ్చబడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన రైతు నర్సింహులు వానాకాలం సీజన్‌లో రెండెకరాల్లో వరి సాగు చేశాడు. వర్షాలు సకాలంలో కురవక రెండు వరి మడులు నీళ్లు లేక బీటలు బారాయి. బోరులో కూడా నీరు తగ్గడం వల్ల పొలానికి నీరు అందలేదు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షానికి బీటలు పడిన మడి నీటితో నిండి వరి పొలం పచ్చబడింది.

కిశోర బాలికలకు వరం

పొదుపు సంఘాల్లో సభ్యత్వానికి కసరత్తు

- 60 దాటితే వృద్ధులు.. వైకల్యం ఉంటే దివ్యాంగుల సంఘం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- జిల్లాలో అవగాహన కార్యక్రమాలు



సంగారెడ్డిలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు



సమావేశానికి హాజరైన ఏపీఎంలు

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఊరిలో కొత్త సంఘాలను ఏర్పాటు చేసి ఆర్థికంగా తోడ్పాటు చేసేందుకు కృషి చేస్తుంది. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ రకాల పథకాలను తీసుకువచ్చింది. అందులో భాగంగా 15 నుంచి 18 ఏళ్లు ఉన్న వారు కిశోర బాలికల సంఘం, 18 ఏళ్లు పైబడిన మహిళలు మహిళా సంఘం, 60 ఏళ్లు పైబడిన వృద్ధుల సంఘం, 40 శాతం అంగవైకల్యం ఉన్న వారిని దివ్యాంగుల సంఘంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

కిశోర బాలికలకు ఆరోగ్యంపై..

జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వం అందించే చేయూతతో ఆర్థికంగా బలపడుతున్నాయి. లోన్లు తీసుకున్న వారు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాటి ద్వారా వచ్చిన లాభంతో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. 15 సంవత్సరాలు నిండిన బాలికలకు కిశోర బాలికల సంఘంగా ఏర్పాటు చేసి వారికి రక్షణ విషయంలో తీసుకోవాల్సినటువంటి అంశాలపై చైతన్యం కల్పిస్తున్నారు. బాలికలకు స్వయం రక్షణ, హెల్త్, పొదుపు వంటి అంశాలపై, యుక్త వయసులో వచ్చే మార్పులు, ఆరోగ్య విషయాలను వివరిస్తున్నారు. వీరితోపాటు గ్రామంలోని దివ్యాంగులు, వృద్ధులకు గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసి సభ్యత్వం కల్పించి, ఆర్థిక ఎదుగుదలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

జిల్లాలో 695 సంఘాలు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం లక్షా 95 వేల మంది మహిళలు సంఘం సభ్యులుగా ఉన్నారు. అందులో 695 గ్రామ సమాఖ్య సంఘాలు ఉన్నాయి. కిశోర బాలికలకు అవగాహన కోసం గ్రామీణాభివృద్ధి సంస్థ, మండల స్థాయి అధికారులకు జిల్లాలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలోని మహిళలు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో శిక్షణనిచ్చి జీవనోపాధి కల్పించడానికి పలు అవకాశాలు కల్పించనున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళా స్వయం సహాయక సంఘాల్లో కొత్తగా కిశోర బాలికలను చేర్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వారితో పాటు వికలాంగులు, వృద్ధులకు సంఘాలు ఏర్పడతాయి. గ్రామ స్థాయిలో నుంచి మండల స్థాయిలో ప్రతి ఒక్కరిని సభ్యులుగా చేర్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వివిధ రకాల రుణాలు అందజేస్తాం. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– సూర్యారావు, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

గ్యాస్ లీకైన ప్రమాదంలో..

వారం క్రితం తల్లి.. ఇప్పుడు కొడుకు మృతి



ప్రభుకుమార్

ఝరాసంగం(జహీరాబాద్): గ్యాస్ లీకై జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం... ఈ నెల 6న మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న తల్లి శంకరమ్మతో పాటు కుమారులు ప్రభుకుమార్, విట్టల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సుమారు 10 రోజుల పాటు చికిత్స పొందుతూ శుక్రవారం ప్రభుకుమార్(35) మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇదిలా ఉండగా ఈ నెల 8న మృతుడి తల్లి శంకరమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి మరణ వార్త మరువకముందే కుమారుడు మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



నర్సమ్మ

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... చిన్నచింతకుంట గ్రామానికి చెందిన పోతారం ముత్యాలు గౌడ్ భార్య నర్సమ్మతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై నర్సాపూర్‌కు వెళ్లి సామగ్రి తీసుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ - మెదక్ రహదారిలోని చిన్నచింతకుంట క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి పల్సర్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆమెను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం ఆమె మృతి చెందింది.

ఆలుమగల మధ్య గొడవలు

పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్య



లక్ష్మి

పాపన్నపేట(మెదక్): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలోని అమ్రియా తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... తండాకు చెందిన లునావత్ లక్ష్మి(40)భర్త గోపాల్‌తో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కొంత కాలంగా ఆలుమగల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మి ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను మెదక్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది.

జవాన్‌ను వెతకడంలో చొరవ చూపాలి



జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఇటీవల మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అనిల్ పంజాబ్‌లో విధులు నిర్వహిస్తూ అదృశ్యమయ్యాడు. అతడిని వెతకడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జవాన్ కుటుంబ సభ్యులను నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశం కోసం కుటుంబాన్ని వదిలి విధులు నిర్వహిస్తున్న జవాన్ అదృశ్యమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించినా ఫలితం లేదన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జవాన్ ఆచూకీ కనిపెట్టి కుటుంబానికి భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, అత్తిని శారద తదితరులు పాల్గొన్నారు.

యాదవ సైనిక విభాగం ఏర్పాటు చేయాలి



యాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానిక యాదవ సంఘం నాయకులు

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం యాదవ సైనిక విభాగాన్ని ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. రెజాంగ్‌లా రాజ్ కలశ యాత్ర పది రాష్ట్రాల ద్వారా ప్రయాణిస్తూ శుక్రవారం హుస్నాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాదవ సైనిక అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... 1962లో భారత, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధంలో మన దేశం తరపున 124 మంది యాదవ సైనికులు పాల్గొని వీరోచితంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ యుద్ధంలో 114 మంది యాదవ సైనికులు అమరులయ్యారని తెలిపారు. అమరవీరుల మట్టిని కలశంగా తయారు చేసి దేశ వ్యాప్తంగా వారి త్యాగాలను ప్రజలకు తెలియజేసేలా ప్రచారం చేస్తున్నామని వివరించారు. ఈ యాత్ర మిగితా రాష్ట్రాల గుండా ప్రయాణిస్తూ నవంబర్ 18న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ముగింపు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర బాధ్యులు శ్రీహరి యాదవ్, నియోజకవర్గ జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్, నాయకులు చందు, బైకని శ్రీనివాస్ యాదవ్, జక్కుల రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆధార్‌లో మార్పుల కోసం వచ్చి..

- పత్రాలు మరిచిపోవడంతో ఇంటికెళ్లిన కొడుకు
- ఆలస్యం కావడంతో గద్వాల్ అనుకుని గజ్వేల్‌కు వెళ్లిన తండ్రి
- కుటుంబీకులకు క్షేమంగా అప్పగించిన పోలీసులు



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో నాగప్పను అతని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: ఆధార్ కార్డులో మార్పుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన వ్యక్తి దారి తప్పాడు. గద్వాల్ అనుకుని గజ్వేల్‌కు వెళ్లిన వ్యక్తిని పోలీసులు తిరిగి అతడి కుటుంబీకులకు అప్పగించిన ఘటన శుక్రవారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ వివరాల ప్రకారం... జోగులాంబ-గద్వాల్ జిల్లా ధారూర్ మండలం రాయలపాడు గ్రామానికి చెందిన చిన్న నాగప్ప మూడు రోజుల క్రితం తన కొడుకు తిక్కన్నతో కలిసి ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పుల కోసం హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో కాగితాలు మరచిపోయానని, వాటిని తీసుకువచ్చేందుకు ఇంటికి వెళ్తున్నానని తండ్రికి చెప్పి అక్కడే ఉండాలంటూ కొడుకు వెళ్లిపోయాడు. కొడుకు రావడంలో ఆలస్యం కావడంతో గద్వాల్‌కు ఎలా వెళ్లాలంటూ రైల్వేస్టేషన్‌లో ఉన్న వారిని అడగ్గా వారు గజ్వేల్ అనుకుని బస్సు ఎక్కించారు. శుక్రవారం గజ్వేల్‌కు చేరుకున్న నాగప్ప బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ సంతోష్ అతని వివరాలు తెలుసుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో వారు గజ్వేల్‌కు చేరుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం నాగప్పను అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా నాగప్ప కుటుంబ సభ్యులు గజ్వేల్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తీర్థంతోపాటు ప్రసాదం

నాచగిరిలో ప్రారంభం



ప్రసాదం వితరణ చేస్తున్న చైర్మన్ రవీంద్ర గుప్తా, ధర్మకర్తలు

వర్గల్(గజ్వేల్): నాచగిరిలో భక్తులకు ఇక తీర్థంతోపాటు ప్రసాద వితరణ జరగనుంది. నిన్నటి వరకు నివేదన సమయంలో మాత్రమే భక్తులకు ప్రసాద వితరణ జరిగేది. ఇపుడు గుడి తెరిచిన వేళ స్వామివారిని దర్శించుకునే ప్రతి భక్తునికి తీర్థంతోపాటు ప్రసాద వితరణ చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. శుక్రవారం నాచగిరి లక్ష్మీనృసింహుని సన్నిధిలో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్త ప్రారంభించారు.

వ్రత శోభితం

స్వాతంత్య్రదినోత్సవ వేళ నాచగిరి భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. వ్రతమాచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.



పాల్గొన్న ఆర్మీ అధికారులు, రిటైర్డ్ జవాన్లు

సలాం జవాన్

తడ్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో సన్మానం

సిద్దిపేటఅర్బన్: 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తడ్కపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో దేశ రక్షణలో పాలు పంచుకున్న ఆర్మీ అధికారులు, రిటైర్డ్ ఆర్మీ జవాన్లను సన్మానించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ సదయ్య, సుబేదార్ కవిత్వాల్‌రెడ్డి, రిటైర్డ్ జవాన్లు స్కైలాబ్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, అశోక్, ప్రధానోపాధ్యాయుడు దేవర కనకయ్య, ఉపాధ్యాయుడు జోగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైత్రి పరిశ్రమపై రైతుల ఆగ్రహం



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడకు చెందిన మైత్రి డ్రగ్స్ పరిశ్రమ యథేచ్ఛగా రసాయన వ్యర్థ జలాలను పంట పొలాల్లోకి విడుదల చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రైతులంతా ఏకమై పరిశ్రమ ఎదుట ధర్నా చేపట్టారు. వర్షం మాటున పరిశ్రమ యాజమాన్యం రసాయనాలను విడుదల చేయడంతో పంట నాశనం అయిందని మండిపడ్డారు. అనంతరం రైతులు మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నాయని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పీసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పరిశ్రమ వద్ద జలాల శాంపిల్స్ సేకరించారు. పరీక్షల అనంతరం వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు సూచించారు. పరిస్థితి మరలా పునరావృతమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి కొడుకును చంపిన తల్లి
- 10 నెలల తర్వాత కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్, చిత్రంలో నిందితులు

తూప్రాన్: వివాహేతర సంబంధానికి కొడుకు అడ్డు వస్తున్నాడని కన్న తల్లి ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ ఘటన 10 నెలల తర్వాత తూప్రాన్ పట్టణ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. కేసు వివరాలను డీఎస్పీ నరేందర్‌గౌడ్ తన కార్యాలయంలో వెల్లడించారు. పట్టణ పరిధిలోని ఆబోతుపల్లి గ్రామ శివారులో 2024 నవంబర్ 28న హల్దీ వాగులో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించి, కేసు నమోదు చేశారు.

కేసు ఛేదింపు ఇలా..

మృతుడు మిస్సింగ్ కేసు ఎక్కడ నమోదు కాకపోవడంతో లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి ఫొటోలను మండలం పరిధిలో అతికించారు. వాటిని గుర్తించిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. మండలంలోని వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అహ్మద్ పాషా(25)గా గుర్తించారు. అయితే మృతుని తల్లి మహ్మద్ రోహినా తన కుమారుడు కనిపించడం లేదని ఇప్పటి వరకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. దీంతో పోలీసులు తల్లిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు రోహినాకు సిద్దిపేట జిల్లా ములుగు మండలం మక్తా మైలారం గ్రామానికి చెందిన జహంగీర్‌తో వివాహం జరిగింది. అనారోగ్యంతో భర్త ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి తన ఇష్టం వచ్చినట్లు అక్కడక్కడ గ్రామాల్లో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ కందాల భిక్షపతి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఐదేళ్లుగా కాళ్లకల్ గ్రామంలో నివాసం ఉంటుంది. కొడుకు అహ్మద్ పాషా మద్యానికి బానిసై తల్లిని నిత్యం వేధిస్తున్నాడు. వివాహేతర సంబంధానికి కుమారుడు అడ్డు వస్తున్నాడని, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది. ఈ క్రమంలోనే 2024 నవంబర్ 27న సాయంత్రం ప్రియుడితో కలిసి తల్లి రోహినా కుమారున్ని బైక్‌పై తూప్రాన్ పట్టణ పరిధిలోని ఆబోతుపల్లి గ్రామ శివారులోకి తీసుకువచ్చి మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న కుమారుడి మెడకు తాడు, చున్నీతో బిగించి హత్య చేశారు. అనంతరం బైక్‌పై తీసుకెళ్లి సమీపంలోని హల్దీ వాగులో పడేశారు. ఎవరికి అనుమానం రాకుండా వెళ్లిపోయారు. కాని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి నిందితురాలు తల్లి రోహినా, ఆమె ప్రియుడు భిక్షపతిలను అరెస్టు చేశారు. చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం, ఐడీ పార్టీ పోలీసులు గోవర్ధన్, కృష్ణ, వెంకట్, నరేందర్, దుర్గేశ్, సురేశ్‌లను డీఎస్పీ అభినందించారు.